ఎండు గడ్డి ధర.. తడిసి మోపెడు!

- ఎకరా చేలో గ్రాసం రూ.7 వేలు
- అయినా దొరకడం లేదంటున్న రైతులు
- పశువులను అమ్ముకోవలసిన పరిస్థితి వస్తుందని ఆవేదన
- యంత్రాలతో కోతల వల్ల ఈ దుస్థితి



యంత్రంతో వరి కోత కోయడం వల్ల చేలో నిరుపయోగంగా ఉన్న గడ్డిని పోగేస్తున్న రైతు



యంత్రాలతో కోసిన గడ్డి కట్టలు

ముమ్మిడివరం: పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. యంత్రాలను ఉపయోగించి వరికోతలు కోయడం వల్ల ఈ దుస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు. ఉన్న గడ్డిని సైతం ఇతర ప్రాంతాలకు తరలించుకు పోవడంతో రాబోయే రోజులలో ఎండు గడ్డి కొరత ఏర్పడి పశువులను అమ్ముకొనే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు అంటున్నారు. ఎకరా చేలో గ్రాసం రూ.7 వేలు పలుకుతోంది. అయినా దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో వరి పంటలు ప్రకృతి వైపరీత్యాల వల్ల పాడై గడ్డి కుళ్లిపోయింది. రైతులు నామమాత్రంగానే గడ్డి నిల్వలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో ఒకపక్క కూలీల కొరత మరో పక్క వాతావరణం అనుకూలించక రైతులు వరికోతలకు యంత్రాలనే ఎక్కువగా ఉపయోగించారు. యంత్రాలతో కోతలు కోయడం వల్ల గడ్డి ముక్కలై వరి చేలలోనే ఉండిపోయింది. దాదాపు 50 శాతం కోతలు ఈ విధంగా చేపట్టడం వల్ల ఎండు గడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. ఈ సీజన్‌లో వచ్చిన గడ్డిని ఎండ బెట్టి మేటుగా నిల్వలు పెట్టుకుని వర్షాకాలం, శీతాకాలాల్లో పశువులకు గ్రాసంగా ఉపయోగిస్తారు. నియోజకవర్గంలో సుమారు 14వేల గేదెలు, 12వేల వరకు ఆవులు, ఎద్దులు ఉన్నాయి. వీటికి ఆయా సీజన్లలో ఎండుగడ్డిని గ్రాసంగా ఉపయోగిస్తారు. ప్రస్తుతం పశుగ్రాసానికి కొరత ఏర్పడటంతో ట్రాక్టర్ ఎండుగడ్డిని రూ.6 వేలు వెచ్చించి కొనుగోలు చేయవలసి వస్తోంది. గడ్డి మేటు వేయటానికి, ఎగుమతి,దిగుమతులకు మరో రూ.వెయ్యి ఖర్చు చేయవలసి వస్తుంది. ఇప్పటికే పశువుల ధరలు చుక్కలనంటడంతో వాటిని కొనుగోలు చేయటానికి రైతులు ముందుకు రావడం లేదు. దీంతో చాలామంది ప్యాకెట్ పాలుకే పరిమితమవుతున్నారు. ఇప్పుడు ఎండు గడ్డికి మంచి డిమాండ్ ఏర్పడటంతో రైతులు పశువులను మేపేందుకు వెనుకడుగేస్తున్నారు. గతంలో పెద్ద రైతులు ఎండు గడ్డిని ఉచితంగా ఇచ్చేవారని ఇప్పుడు మోపు రూ.100కు కొనుగోలు చేయవలసి వస్తోందని చిన్నకారు రైతులు అంటున్నారు. పచ్చగడ్డి కంటే ఎండు గడ్డి కోసం రైతులు ఇబ్బందులు పడవలసి వస్తోంది. నియోజకవర్గంలో సుమారు 45వేల ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు.

ఎండు గడ్డికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



వరి కోతలు యంత్రాలతో కోయడం వల్ల ఎండు గడ్డికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో రైతులు గడ్డిని ఉచితంగా ఇచ్చేవారు. గడ్డిని మేటులుగా వేసుకుని వర్షాకాలంలో పశువులకు గ్రాసంగా వేసేవాళ్లం, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కొందామన్నా దొరకడం లేదు. వర్షాకాలంలో పశుగ్రాసం లేక పశువులను అమ్ముకొనే పరిస్థితి ఏర్పడుతోంది.

– గనిశెట్టి శివ, పాడి రైతు, గాడిలంక

ఎండు గడ్డికి తడిసి మోపెడు అవుతోంది



ఎకరా వరి చేలో ఎండు గడ్డి కొనాలంటే రూ.7వేల వరకు అవుతుంది. యంత్రాలతో కోతలు కోయడం వల్ల గడ్డిని చేలల్లోనే వదిలేస్తున్నారు. దాన్ని పోగు చేయాలన్నా, యంత్రాలతో కట్టలు కట్టాలన్నా తలకు మించిన భారం అవుతుంది.

– పెయ్యల శ్రీనివాసరావు, రైతు, ముమ్మిడివరం

క్లుప్తంగా

నేటి రిలే దీక్షలకు తరలిరావాలి

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరతో పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలన్న డిమాండ్‌తో అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద బుధవారం ఉదయం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారని పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ తెలిపారు. ఈ రిలే నిరాహార దీక్షలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పార్టీ కో ఆర్డినేటర్లతో పాటు జిల్లాలోని పార్టీ ముఖ్య నేతలు పాల్గొనే ఈ కార్యక్రమం రైతులకు అండగా, మద్దతుగా జరుగుతుందన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ



తల్లులకు పాద పూజ చేస్తున్న సత్యసాయి బాల వికాస్ విద్యార్థులు

అమలాపురం టౌన్: సత్యసాయి కళ్యాణ మండపంలో జరుగుతున్న సత్యసాయి వేసవి ఉచిత శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. అమలాపురం డివిజన్ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో సత్యసాయి బాల వికాస్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ వేసవి శిక్షణ తరగతుల్లో బాల బాలికలు నైతిక విలువలు, నీతి కథలు, కుటుంబ బంధాలు, పురాణ ఇతి హాసాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకున్నారు. బాల వికాస్ విద్యార్థులు తల్లికి వందనం పేరుతో తమ తల్లులకు కాళ్లు కడిగి పూలతో పూజించారు. ముఖ్య అతిథిగా చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ వీవీఎస్ఎన్ మూర్తి హాజరయ్యారు. డివిజన్ సత్య సాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ తొలుత ప్రశాంతి పతాకాన్ని ఆవిష్కరించారు. సాయిబాబా తల్లి ఈశ్వరమ్మ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పుర వీధుల్లో ర్యాలీ జరిగింది.

12న మాలల రణభేరి



కరపత్రాలను విడుదల చేస్తున్న మాల మహానాడు నాయకులు

ఉప్పలగుప్తం: మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి.రావు జయంతి సందర్భంగా ఈ నెల 12న కాకినాడలో మాలల రణభేరి సభ నిర్వహిస్తున్నట్టు మాల మహానాడు నాయకులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో పి.వి.రావు చిత్రపటానికి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చలో కాకినాడకు పిలుపునిస్తూ కరపత్రాలను విడుదల చేశారు. జల్లి శ్రీనువాస్, కొంకి వెంకట బాబ్జి, కుంచే బాబులు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, పోలినాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రిలే దీక్షలను విజయవంతం చేయండి

ఐ.పోలవరం: రబీ ధాన్యం కొనుగోలు పట్ల ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్య వైఖరి నిరసనగా అమలాపురంలో బుధవారం నిర్వహించే రిలే దీక్షలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున తరలి రావాలని వైఎస్సార్ సీపీ ఐ.పోలవరం మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకట పతిరాజు మంగళవారం పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

తాళ్లరేవు: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాన్ని మంగళవారం సుంకరపాలెం పంచాయతీ బాబానగర్‌లో నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి తహసీల్దార్ పితాని త్రినాథరావు తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. తొలుత పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాశి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి హైదరాబాద్ నుంచి వచ్చిన రేచర్ల రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం



గాడిలంకలో సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే సుబ్బరాజు తదితరులు

ముమ్మిడివరం: గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ముమ్మిడివరం మండలంలో మంగళవారం ఆయన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఎంపీ గంటి హరీష్‌మాధూర్‌తో కలిసి చేసిన సందర్భంగా మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తల సాయి, తాడి నరసింహారావు, గొలకోటి దొరబాబు పాల్గొన్నారు.

నేడు సీచమ్ ట్రోఫీ సెమీఫైనల్స్

యానాం: పుదుచ్చేరి రాష్ట్ర క్రికెట్ అసోషియేషన్ నిర్వహణలో యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోయేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సీచమ్ ట్రోఫీ–2025లో భాగంగా బుధవారం సెమీఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారని మంగళవారం అధ్యక్షుడు పంతగడ సుమన్ తెలిపారు. స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో మొదటి సెమీఫైనల్ అంబేడ్కర్ ఎలవెన్స్ వెర్సెస్ నాగా ఎలవెన్స్ జట్లు, రెండవ సెమీఫైనల్‌లో కెవిఆర్ వెర్సెస్ అగ్ని ఎలెవెన్స్ జట్లు తలపడతాయన్నారు. క్వార్టర్ ఫైనల్స్‌లో అంబేడ్కర్ ఎలెవెన్స్ జట్టు తరపున ఆడిన క్రీడాకారుడు వెంకటేష్ 70 పరుగులు చేయడంతో పాటు 3 వికెట్లు సాధించడంతో అతను మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడని తెలిపారు.

అక్రమ కుళాయిల తొలగింపు



వాసాలతిప్పలో అక్రమ మోటార్లను తొలగిస్తున్న సిబ్బంది

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి పంచాయతీ పరిధి వాసాలతిప్ప గ్రామంలో వాసాలతిప్ప నుంచి నక్కా రామేశ్వరం వెళ్లే ప్రధాన పైపు లైనుపై అక్రమంగా వేసిన 8 కుళాయిలను మంగళవారం తొలగించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.సురేష్ తెలిపారు. గ్రామంలో అక్రమంగా కనెక్షన్‌లు అమర్చి మోటార్ల సహకారంతో తోడుకుని తాగునీటి సరఫరా కాకుండా కొందరు అడ్డుకుంటున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జనరేటర్‌లో ఆయిల్ లేక నిలిచిన రిజిస్ట్రేషన్లు

- అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పడిగాపులు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట వేచి ఉన్న ఆస్తుల క్రయ విక్రయదారులు

అమలాపురం టౌన్: కొత్త స్లాట్ విధానంలో రిజిస్ట్రేషన్లు కేవలం 20 నిమిషాల్లో పూర్తి అవుతాయని ఆ శాఖ ఉన్నతాధికారుల ప్రకటనలు, ప్రచారాలు ఇటీవల కాలంలో హోరెత్తుతున్నాయి. అయితే అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జనరేటర్‌లో ఆయిల్ లేదన్న సాకుతో ఆస్తుల క్రయ విక్రయదారులు మంగళవారం గంటల తరబడి ఎదురు చూడాల్సి రావడంతో స్లాట్ విధానం అమలు ఏమైందన్న విమర్శలు వినిపించాయి. స్థానిక ఈదరపల్లి వంతెన నిర్మాణం కోసం ఆక్రమణల తొలగింపు నేపథ్యంలో పట్టణంతోపాటు రూరల్ మండలంలోని కొన్ని గ్రామాల్లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అధికారిక విద్యుత్ కోత ఉంటుందని ఆ శాఖ అధికారులు ముందు రోజే ప్రకటించారు. అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్ల విషయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది మేలుకోలేదు. కరెంటు ఉండదని తెలిసి కార్యాలయ జరరేటర్‌లో కనీసం ఆయిల్ నిల్వలు ఉంచుకునే ప్రయత్నం చేయలేదు. జనరేటర్‌లో ఆయిల్ లేదన్న కారణంతో కొన్ని గంటల పాటు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. అప్పటికే రిజిస్ట్రేషన్ల కోసం ఉన్న దాదాపు 50 మంది ఆస్తుల క్రయ విక్రయదారులు కార్యాలయం వద్దే పడిగాపులు కాయాల్సి వచ్చింది. రిజిస్ట్రేషన్లతో రూ.కోట్ల ఆదాయాన్ని ఆర్జించే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి జనరేటర్ సౌకర్యం ఉన్నా ఒక్కోసారి అది పనిచేయదు. పనిచేసినా ఆ జనరేటర్‌లో ఆయిల్ పోయించేందుకు తీరిక లేదన్నట్లుగా క్రయ విక్రయదారులను ఇబ్బంది పెట్టారు. వారు సైతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఉన్న చెట్ల నీడలో కూర్చుని ఎదురు చూశారు.

12 నుంచి విద్యార్థులకు ఉచిత శిక్షణ



ఉచిత శిక్షణ తరగతులపై చర్చిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: విద్యార్థులకు ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకూ వేసవి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు తెలిపారు. స్థానిక జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో పలు ప్రజా సంఘాల ప్రతినిధులు మంగళవారం నిర్వహించిన సమావేశంలో సుబ్బారావు మాట్లాడారు. ఈ వేసవి ఉచిత శిక్షణ కేంద్రాలను అమలాపురం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, రాజోలు, అల్లవరం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఐద్వా జిల్లా నాయకురాలు డి.ఆదిలక్ష్మి వెల్లడించారు. సైన్స్, మ్యాథ్స్, డ్రాయింగ్ అండ్ క్రాఫ్ట్స్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు బేతినీడి శ్రీనివాసరావు, జీవీ రమణ, టి.నాగవరలక్ష్మి, జి.దుర్గాప్రసాద్, కారెం వెంకటేశ్వరరావు, పి.అమూల్య, సీహెచ్.సత్యవేణి శిక్షణ తరగతుల నిర్వహణపై చర్చించారు.

ఆర్‌పీఓను కలిసిన మహిళా కమిషన్ సభ్యులు



ఆర్‌పీఓ మునిస్వామిని సత్కరించిన పుదుచ్చేరి మహిళా కమిషన్ సభ్యులు

యానాం: యానాం విచ్చేసిన పుదుచ్చేరి మహిళా కమిషన్ సభ్యుల బృందం మంగళవారం స్థానిక పరిపాలనాధికారి మునిస్వామిని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా మహిళా కమిషన్ బాధ్యతల గురించి చైర్‌పర్సన్ ఎం.నాగజ్యోతి వివరించారు. మహిళలకు సంబంధించి కుటుంబ తగాదాలు, వేధింపులు, మహిళా వర్కర్స్ సమస్యలు, మహిళా ఉద్యోగుల ఎదుర్కొంటున్న సమస్యలు, మానసిక ఒత్తిడిని ఎదుర్కొనేలా కౌన్సెలింగ్ తదితర వాటిపై కృషి చేస్తుందన్నారు. సభ్యులు కె.సుజాత, ఎస్.అన్నరసి, ఎ.చంద్ర పాల్గొన్నారు.

మా గోడు వినేదెవరు?



చేలల్లో నీరు

అల్లవరం: అకాల వర్షాలతో పంట చేలల్లో నీరు చేరి వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడిందని కొమరగిరిపట్నం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట చేతికి వచ్చే సమయానికి అకాల వర్షాలు రైతు నడ్డి విరుస్తాయని మా గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు తెలిపారు. పంటను ఒబ్బిడి చేయడానికి కూలీలెవ్వరూ రావడం లేదన్నారు. ఉపాధి హామీ పథకంలో పనులు కూడా వరి కోతల సమయంలోనే నిర్వహిస్తున్నారని, దీంతో కూలీలు ఉపాధి పనులకు తప్ప వ్యవసాయ పనులకు రావడం లేదని రైతులు పితాని దొరబాబు, దైవాల జాను, బొంతు వెంకటేశ్వరరావు అన్నారు. వ్యవసాయ పనులు ముగిసేంత వరకు ఉపాధి హామీ పనులను తాత్కాలికంగా వాయిదా వేయాలని కోరారు.

రాము కార్టూన్‌కు రాష్ట్ర స్థాయి బహుమతి



రాము గీసిన మొక్కంటే తెలియని ఊరు కార్టూన్



వ్యంగ్య చిత్రకారుడు రాము

అమలాపురం రూరల్: తొలి తెలుగు వ్యంగ్య చిత్రకారుడు తలిశెట్టి రామారావు జయంతి పురస్కరించుకుని తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా హాస్యానందం మాసపత్రిక నిర్వహించిన 2025 కార్టూన్ పోటీల్లో అమలాపురం రూరల్ బండారులంక గ్రామానికి చెందిన వ్యంగ్య చిత్రకారుడు మాడా రాము గీసిన కార్టూన్ విశిష్ట బహుమతికి ఎంపికైంది. ఈ సమాచారాన్ని రాము హాస్యానందం సంపాదకుని ద్వారా అందుకున్నాడు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి 150 మంది తెలుగు కార్టూనిస్టులు పోటీ పడగా 23 వ్యంగ్య చిత్రాలను ఎంపికచేశారు. పట్టణ అపార్టుమెంట్ సంస్కృతిలో పచ్చదనం లేని, పర్యావరణానికి హాని కలిగించే నగర పరిసరాలతో ఆధునిక మానవుని జీవన విధానానికి అద్దం పట్టేలా మొక్కంటే తెలియని ఊరును రాము కార్టూన్‌గా గీశాడు. మే 20వ తేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో రాము బహుమతి అందుకుంటారు.

మన ఊరి బడిలోనే చదువుకుందాం

అల్లవరం: మనం చదువుకున్న బడి..మన ఊరి బడి..ప్రభుత్వ బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం నమోదుకు ఎస్‌టీయూ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎంఈఓ కిరణ్‌బాబు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాల గురించి అల్లవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో మన విద్యార్థులు సాధించారని కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఫలితాలు సాధించారని ఎంఈఓ తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్, ట్రిపుల్ ఐటీ, నవోదయ విద్యాసంస్థల్లో చదివే అవకాశం ఉంటుందన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కురంగేశ్వరుని కల్యాణోత్సవాలు



శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ కురంగేశ్వరస్వామి

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పాతకోరంగి గ్రామంలో వేంచేసియున్న బాలా త్రిపురసుందరి సమేత శ్రీ కురంగేశ్వరస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈఓ కేవీవీ వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులు కేఆర్‌కే సాయిప్రసాద్ నేతృత్వంలో సాయంత్రం ఏడు గంటలకు స్వామివారి దివ్య కల్యాణం, అనంతరం మహా అన్న సమారాధన, 10వ తేదీ రాత్రి ఏడు గంటలకు సదస్యం, 12వ తేదీ ఉదయం 6.30 గంటలకు త్రిశూల స్నానం, రాత్రి ఏడు గంటలకు శ్రీ పుష్ప యాగం నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్‌ను సత్కరించిన జగ్గిరెడ్డి



ఛాయాదేవిని సత్కరిస్తున్న జగ్గిరెడ్డి. చిత్రంలో పార్టీ నేతలు డాక్టర్ శ్రీకాంత్, శ్రీనివాసరావు తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం కల్వకొలనువీధికి చెందిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కల్వకొలను ఛాయాదేవి ఇంటికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పార్టీ నాయకులు మంగళవారం సాయంత్రం వచ్చి ఆమె కుటుంబంతో మాట్లాడారు. ఛాయాదేవే కాకుండా ఆమె భర్త దివంగత సాగరం కూడా మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసి దంపతులిద్దరూ పట్టణాభివృద్ధికి కృషి చేశారని జగ్గిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఛాయాదేవిని జగ్గిరెడ్డి సత్కరించారు. అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాల పార్టీ కో ఆర్డినేటర్లు డాక్టర్ పినిపే శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, కుడుపూడి భరత్ భూషణ్, కల్వకొలను బాబు, నల్లా ప్రసాద్, కల్వకొలను ఉమ పాల్గొన్నారు.

హై టెన్షన్ విద్యుత్ స్తంభాల తొలగింపు



ఈదరపల్లి వంతెన వద్ద విద్యుత్ స్తంభాల పనులు చేస్తున్న ఉద్యోగులు

అమలాపురం రూరల్: ఈదరపల్లి రెండోవ వంతెన నిర్మాణానికి అడ్డుగా ఉన్న 33 కేవీ హై టెన్షన్ విద్యుత్ స్తంభాలను ట్రాన్స్‌కో అధికారులు తొలగించారు. మంగళవారం ఉదయం నుంచి అమలాపురం మార్కెట్, కామనగరువు, ఉప్పలగుప్తం, చల్లపల్లి, సబ్ స్టేషన్ల పరిధిలో 7 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. భారీ క్రేన్ సాయంతో విద్యుత్ స్తంభాలను తొలగించారు. వంతెన ఇరువైపులా ఉన్న స్తంభాలను తొలగించారు. ఈదరపల్లి వంతెన రోడ్డులో చెట్లు కొమ్మలను నరికివేసి విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ పనుల కారణంగా ఈదరపల్లి వంతెన వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. ఒకసారిగా నాలుగు వైపుల నుంచి వాహనాలు రావడంతో ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడ్డారు. వంతెన వద్ద ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ స్తంభాలు మార్పు చేసే పనులు చేపట్టడంతో ట్రాఫిక్ నిలిపివేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు.

అభాగ్యులకు అన్నదానం

తాళ్లరేవు: కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రాహ్మర్పణ్ ఉచిత అభాగ్యుల భోజన పథకంలో భాగంగా మంగళవారం తాళ్లరేవు గ్రామానికి చెందిన తొగరు శివరామమ్ అభాగ్యులకు అన్నదానం చేశారు. పథకం 858వ రోజున తన పుట్టినరోజును పురస్కరించుకుని అన్నదానం చేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు నడింపల్లి వినోద్, పొన్నాడ రాజు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేటి వైఎస్సార్ సీపీ రిలే దీక్షకు తరలి రావాలి

తాళ్లరేవు: అకాల వర్షాలకు దెబ్బతిన్న ధాన్యం కొనుగోలు చేయాలని, రైతుకు కనీస గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ అమలాపురంలో వైఎస్సార్ సీపీ బుధవారం నిర్వహించే రిలే దీక్షకు పెద్దఎత్తున జనం తరలిరావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌తో పాటు పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనాలని గోవిందకుమార్ పిలుపునిచ్చారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె నోటీసు



కమిషనర్ రవివర్మకు సమ్మె నోటీసు ఇస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

ముమ్మిడివరం: కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్స్‌ను అమలు చేయాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 20నుంచి మూడు రోజులపాటు సమ్మె చేయనున్నట్టు కమిషనర్ పి.రవివర్మకు మంగళవారం నగర పంచాయతీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె నోటీసు ఇచ్చారు. ఆ మూడు రోజులు విధుల బహిష్కరిస్తూ తాగునీరు, విద్యుత్ దీపాల నిర్వహణ నిలుపుదల చేస్తామన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్కాస్ రద్దు చేయవద్దని, ప్రయివేటు ఏజెన్సీలను అనుమతించవద్దని వారు కోరారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన



నిరసన తెలుపుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద సమ్మెలో భాగంగా మంగళవారం 9వరోజు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ కమ్యూటీ హెల్త్ తొమ్మిది రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూవారు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.మమత జ్యోతి, జిల్లావర్కింగ్ అధ్యక్షుడు ఏ.సాయి శంకర్, శ్రీరామ్, హిమజ పాల్గొన్నారు.

చలో కాకినాడ విజయవంతం చేయండి

అల్లవరం: స్థానిక హైస్కూల్ సెంటర్లో మాలల రణభేరి పోస్టర్‌ని మంగళవారం ఆవిష్కరించారు. కాకినాడలో తలపెట్టిన మాలల రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు ఉపాధ్యక్షుడు పెయ్యిల పరశురాముడు కోరారు. మాలమహానాడు ప్రతినిధులు జల్లి శ్రీనివాసరావు, నాతి శ్రీనివాసరావు, కొనుకు బాపూజీ, సాధనాల శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తీర్థం

అమలాపురం రూరల్: మండలంలో రోళ్ళపాలెం గ్రామదేవత ముత్యాలమ్మ వారి తీర్థ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. సోమవారం రాత్రి అమ్మవారి జతర మహోత్సవాలు నిర్వహించారు. మంగళవారం జరిగిన తీర్థంలో భక్తులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ గంటి హరీష్ మాధుర్, సర్పంచ్ మట్ట వైదేహి అమ్మవారిని దర్శించారు.

స్మార్ట్ స్కూల్ పనుల పరిశీలన

యానాం: విద్యార్థులకు ఆధునిక సాంకేతికత ద్వారా బోధన చేయాలనే ఉద్దేశంతో వివిధ పాఠశాలల్లో ఓఎన్‌జీసీ సహకారంతో స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల పనులను చేపడుతున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. మంగళవారం ఆయన కేఎస్‌జీజీ ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో స్మార్ట్ తరగతుల పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కెఎస్‌జిజి బాలికల హైస్కూల్‌తో పాటు మెట్టకూరు ప్రభుత్వ పాఠశాల, పరంపేట ప్రైమరీస్కూల్, గిరియాంపేట స్కూల్, దరియాలతిప్ప, ఎమ్‌జిజిబిహెచ్ హైస్కూల్ లలో సైతం స్మార్ట్‌స్కూల్ పనులు చేస్తున్నారన్నారు. విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, పీడబ్ల్యూడీ అధికారులు పాల్గొన్నారు.



తరగతి గది పరిశీలిస్తున్న మల్లాడి